
క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓఎస్ లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



సాధనను పరిశీలిస్తున్న ఎంఈఓ మౌలాలి

మిడుతూరు: దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ ద్వారా సత్ఫలితాలు వస్తాయని ఎంఈఓ మౌలాలి అన్నారు. మంగళవారం మండల భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల చిన్నారులకు ఫిజియోథెరపీ వైద్యులు సూచించిన మేరకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయించాలన్నారు. చిన్నారులకు సాధనకు ముందు, సాధన తర్వాత ఎలా ఉందని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిష్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ వైద్యులు దావాగ్ని శ్రీధర్, ఈఐఆర్టీ మియ్యబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

2న మెగా రక్తదాన శిబిరం

పగిడ్యాల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని మార్చి 2వ తేదీన మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు మండల మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి మంగళవారం తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం- 1 వద్ద ప్రాణదాత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరంలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తంను దానం చేయాలని పిలుపునిచ్చారు. మండల వ్యాప్తంగా ఉన్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


హత్యకేసులో నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ రవీంద్ర

మహానంది: గోపవరం గ్రామంలో పాతకక్షల నేపథ్యంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన చెవుల శ్రీనివాసులు చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. శ్రీనివాసులపై ఈ నెల 13న కర్రలు, రాళ్లతో దాడి చేసిన ఐదుగురు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ రవీంద్ర తెలిపారు. శ్రీనివాసులు, పక్కీరమ్మల మధ్య జరిగిన ఘర్షణలో పక్కీరమ్మ, ఆమె బంధువులు దాడి చేయడంతో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడి కోలుకోలేక మృతి చెందారు. ముందు హత్యాయత్నం కేసుగా నమోదు చేసి, ఆపై హత్యకేసుగా నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన గోపవరం గ్రామానికి చెందిన పక్కీరమ్మ, తమ్మడపల్లె అయిజ నరసింహులు, ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల, పడకండ్ల గ్రామాలకు చెందిన శివరాముడు, మణిమహేష, నాగలక్ష్మమ్మలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వివరించారు.

వెంకటనారాయణరెడ్డి ఎంఫిల్ పట్టా



వెంకటనారాయణరెడ్డి

శ్రీశైలం: కర్నూలు జిల్లాలో తీర్థయాత్రలు, పర్యాటకంపై పరిశోధనలు చేసిన మాడు గుల వెంకట నారాయణరెడ్డి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి మంగళవారం తెలుగు యూనివర్సిటీ వారు ఎంఫిల్ పట్టాలు అందజేశారు. క్షేత్రపరిధిలోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, చరిత్ర-సంస్కృతి పురావస్తు శాస్త్ర పీఠంలో పీఠాధిపతిగా పనిచేసిన పెదారపు చెన్నారెడ్డి తన పరిశోధనకు పర్యవేక్షకులుగా వ్యవహించారని వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

నేటి నుంచి జీవాలకు గాలికుంటు టీకాలు

మహానంది: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు బుధవారం నుంచి గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి కరుణాకర్ తెలిపారు. తిమ్మాపురంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ తీవ్రమైనజ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకు రొప్పడం, ఎద్దులలో పనిసామర్థ్యం తగ్గినట్లు తదితర లక్షణాలను గుర్తిస్తే టీకాలు వేయించాలన్నారు. తిమ్మాపురంలోని పశువైద్య కేంద్రం వద్ద టీకాల కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

రైతన్నలకు 'భరోసా'

- శ్రీశైలం నియోజకవర్గంలో 27,546 మంది రైతులకు రైతు భరోసా జమ
- నందికొట్కూరు నియోజకవర్గంలో 39,962 మందికి లబ్ధి
- తుఫానులో పత్తిపంట దెబ్బతిన్న రైతన్నలకు నష్టపరిహారం చెల్లింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



వడ్లరామాపురం ఆర్బీకేలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగాన్ని తిలకిస్తున్న ఏడీఏ, రైతులు

ఆత్మకూరు: పాదయాత్రలో రైతన్నల కష్టాలను, ఇబ్బందులను కళ్లారా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వారికి పంటల సాగుకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.13,500 చొప్పున వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్ పథకం పేరుతో నగదును అందిస్తున్నారు. ఈ నగదును నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తున్నారు.

నాలుగో ఏడాది మూడో విడత సాయం..

నాలుగో ఏడాది ఇప్పటికే రెండు విడుతల్లో రూ. 11,500 చొప్పున సాయం అందించగా మూడో విడతగా రూ.2వేలను మంగళవారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేశారు. అంతేకాకుండా తుఫాను ప్రభావం వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా విడుదల చేయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తూ, సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలోని 27,256 మంది రైతులకు రూ.5,86,08,000లు నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్‌నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. ఇదే తోవలో నందికొట్కూరు నియోజకవర్గంలో 39,962 మంది అన్నదాతలకు రూ.8,42, 92,500 నగదు వారివారి ఖాతాల్లో అయ్యింది.

పత్తి రైతుకు ఊరట

నంద్యాల జిల్లాలోని పత్తి రైతుకు గతేడాది తుపాను ప్రభావం వలన పత్తి పంట భారీగా దెబ్బతింది. పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ (పరిహారం) కూడా వారి ఖాతాల్లో వేశారు. శ్రీశైలం నియోజకవర్గంలో బండిఆత్మకూరు మండలంలో పత్తి పంట సాగు చేసిన 171 మంది రైతులకు చెందిన 103.6 హెక్టార్లుకు సంబంధించి రూ.54లక్షలు, మహానంది మండలంలో రూ.16.6 హెక్టార్లులో 27 మంది రైతులకు గాను రూ. 2.49 లక్షలు, వెలుగోడు మండలంలో 13.72 హెక్టార్లకు 25 మంది రైతులకు గాను రూ.2.06 లక్షలు మంజూరు అయ్యాయి. నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు మండలంలో 203.39 హెక్టార్లలో 219 మంది రైతులకు రూ.24.67 లక్షలు, పగిడ్యాల మండలంలో 6.11 హెక్టార్లలో 10 మంది రైతులకు గాను రూ.92 వేలు, జూపాడుబంగ్లా మండలంలో 24.27 హెక్టార్లకు గాను 39 మంది రైతులకు రూ.3.57 లక్షలు వారి ఖాతాల్లో జమ అయ్యాయి.

అర్హత ఉన్న ప్రతి రైతుకు నగదు జమ



ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లోని రైతులకు అర్హత ఉంటే చాలు రైతు భరోసా కింద రైతుల పేర్లను నమోదు చేస్తున్నాం. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రబి, ఖరీఫ్ సీజన్‌లో రూ.13,500 చొప్పున ప్రభుత్వం నిధులు నేరుగా వారి ఖాతాల్లో జమచేస్తుంది. ప్రస్తుతం రైతు భరోసా సొమ్ము రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే తమ వద్దకు దరఖాస్తులు తీసుకు వస్తే వారి పేర్లను నమోదు చేస్తాం.

– అంజనేయులు, ఏడీఏ ,ఆత్మకూరు

రైతులకు ఎంతో ఊరట



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పాలనను తలపించేలా పరిపాలన కొనసాగిస్తున్నారు. రైతుల కళ్లల్లో ఆనందాన్ని చూసేందుకు రైతు భరోసా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏడాది కి రూ.13,500 చొప్పున రైతులకు అందజేస్తున్నారు. ప్రస్తుతం రూ.2వేలు మంజూరు చేశారు. ఇది పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన రైతులకు ఎంతో ఊరటనిస్తుంది. ప్రతి రైతన్న ఈ పథకంపై హర్షం వ్యక్తం చేస్తున్నాడు.

–విష్ణువర్ధన్‌రెడ్డి, సిద్దాపురం

రైతుల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



పొలాల్లో అహర్నిషలు పనిచేసే రైతులు, కౌలు రైతులకు చేదోడుగా ఉండేందుకు రైతు భరోసాను మంజూరు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని నిరూపించుకున్నారు. పీఎం కిసాన్ కింద మంజూరు కాని ఎస్సీ, ఎస్టీ , కౌలు రైతులకు రూ.7,500 చొప్పున నేరుగా ముఖ్యమంత్రి కౌలు రైతులకు అందించడం గర్వించదగ్గ విషయం. రైతన్నల సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– బైరాపురం మహబూబ్‌బాషా,ఆత్మకూరు

39,962 మందికి రైతు భరోసా

జూపాడుబంగ్లా: రైతుల సంక్షేమార్థం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా - పీఎం కిసాన్ పథకం కింద నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో 39,962 మంది రైతులు లబ్ధిపొందినట్లు ఏడీఏ విజయశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, జూపాడుబంగ్లా, మిడుతూరు, పగిడ్యాల, పాములపాడు, కొత్తపల్లి మండలాల పరిధిలోని రైతులకు నాలుగో వడత మూడో ఇన్‌స్టాల్‌మెంటు మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. నందికొట్కూరు మండలం పరిధిలోని 6,096 మంది రైతులకు రూ.1,29,51,000, పగిడ్యాల మండలంలో 3,544 మందికి రూ.75,93,000, పాములపాడు మండలంలో 7,644 మందికి రూ.1,59,66,000, జూపాడుబంగ్లా మండలంలో 7,371 మందికి రైతులకు రూ.1,53,45,500, మిడుతూరు మండలంలో 8,891 మంది రైతులకు రూ.1,86,09,000 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయ్యాయని తెలిపారు.

రైతులకు ఊరట

కొత్తపల్లి: రైతు భరోసాతో రైతన్నలకు ఊరట లభిస్తుందని ఏఓ కె.మహేష్ అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో పీఎం కిసాన్-వైఎస్సార్ రైతు భరోసా లాంచింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 2022-23 సంవత్సరానికి గాను 6,416 మంది రైతుల ఖాతాలలో రూ.1,38,28,000లు ప్రభుత్వం జమ చేసిందన్నారు.

రవీంద్రారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపిద్దాం



మాట్లాడుతున్న శిల్పా భువనేశ్వరరెడ్డి

వెలుగోడు: సమష్టి కృషితో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపిద్దామని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలుగా జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, సాధించిన ప్రగతిని పట్టభద్రులకు వివరించి ఓటు అడగాలని సూచించారు. ఇటీవల కొన్ని దుష్టశక్తులతో కూడి ప్రతిపక్ష పార్టీలు నిత్యం తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్, నాయకులు అమీర్ అలీఖాన్, ఆసిఫ్ అలీఖాన్, గోవిందు, షంషీర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూసకు మద్దతుగా ప్రచారం

మిడుతూరు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక ఓట్లతో గెలిపించాలని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం మిడుతూరులో బీసీ, ఎస్సీ, మైనార్టీ కాలనీలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లు శివనాగిరెడ్డి, బక్కన్న, రామ్మోహన్, రామానాయుడు, మాసూంవలి పాల్గొన్నారు.

కొత్తపల్లి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గ్రాడ్యుయేట్స్ అందరూ తమ ఓటును వినియోగించుకొని అధిక మెజారిటీతో గెలిపించాలని గ్రాడ్యుయేట్స్ మండల కో-ఆర్డినేటర్ అన్నలదాసు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కదిరి సునీల్ కోరారు. మంగళవారం ముసలిమడుగు గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ఎన్నికల కరపత్రాలను పంపిణీ చేశారు.

రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలి

జూపాడుబంగ్లా: వైఎస్సార్‌సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నుపూస రవీంద్రారెడ్డికి మొదటి ఓటువేసి గెలిపించాలని వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, లింగాపురం సర్పంచు నాగార్జునరెడ్డి, బన్నూరు వైస్ సర్పంచ్ గంగాధరగౌడు, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దిలేటిరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వెన్నుపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోస్, కుమ్మరి హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలను గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దాం

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- ఐక్యంగా ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేద్దాం
- నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: పట్టభద్రులు, టీచర్స్, ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి జిల్లా కానుకగా ఇద్దామని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. నందికొట్కూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, మండలాల వారితో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న అమ లు చేసిన సంక్షేమ పథకాలను వివరించి జగనన్న ప్రతిపాదించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి, ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌లకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

మూడు స్థానాల్లో గెలవడం ఖాయం

టీడీపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందలేమని తెలిసినా రాజకీయ కుయుక్తులతో ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ స్థానం ఏకగ్రీవం కాకుండా అనామకులతో నామినేషన్ వేయించి నీచరాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. వారు ఎన్ని కుతంత్రాలు, కుట్రలు పన్నినా మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులు గెలుపొందటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల వారీగా ఇచ్చిన ఓటర్ల జాబితా ప్రకారం మండల, గ్రామ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఓటర్ల వద్దకు వెళ్లి ఓటు వేయాలని కోరాలని తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్‌షకూర్, రైతు విభాగం అధ్యక్షుడు వంగాల సిద్దార్థరెడ్డి, సొసైటీ చైర్మన్ సగినేల హుసేనయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు ధర్మారెడ్డి, మొల్ల జాకీర్‌హుసేన్, దేశెట్టి సుమలత, సర్పంచులు రామస్వామి, మాణిక్యమ్మ, బాలమద్దిలేటి, మౌలాలి, మొట్టి బాలయ్య, కొంగర నవీన్, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సంటిగారి కృపాకర్, ఎస్సీ, ఎస్టీ సెల్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాండురంగస్వామికి సహస్ర నామార్చనలు



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

నంద్యాల(అర్బన్): పాండురంగాపురంలో వెలసిన రుక్మిణి సమేత పాండురంగస్వామికి సహస్ర నామార్చనలు నిర్వహించారు. అంతకుముందు పాల్గున శుద్ధ నవమిని పురస్కరించుకుని దుర్గా సూర్త, శ్రీసూర్త అభిషేకాలు, అర్చన హారతులు, మంత్ర పుష్పాలు, తీర్థప్రసాద వితరణ, ఫల ప్రధానములు నిర్వహించారు. సాయంత్రం అన్నాభిషేకాలు, సహస్ర నామార్చానలు, హోమాలు, హారతి, తీర్థప్రసాద వినియోగములు, ఫలప్రదానముల అనంతరం స్వామి వారి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. అలాగే రుక్మిణి అమ్మవారు, పార్వతి దేవి, శివుడు, వీరభద్రుడు, నాగేంద్రుడు, గణపతి దేవుళ్లను అలంకరించి పూజలు నిర్వహించారు.

'మట్టి అక్రమ విక్రయాలను పట్టించుకోవడం లేదు'

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం గ్రామంలో ఎలాంటి అనుమతుల్లేకుండా అక్రమంగా మట్టిని విక్రయించి సొమ్ముచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవటం లేదని సర్పంచ్ నాగార్జునరెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పంచాయతీ అనుమతులు, మండల అధికారుల అనుమతుల్లేకుండా గ్రామపరిధిలోని కుంటల వద్ద రాత్రి వేళల్లో ఇష్టారాజ్యంగా ఎర్రమట్టిని తవ్వి విక్రయించుకుంటున్నాడని తెలిపారు. ఈ విషయమై మండల అధికారులకు సమాచారం అందించానని, అయినా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. అధికారులు చర్యలు తీసుకొని గ్రామంలో అక్రమ మట్టితవ్వకానిన అరికట్టాలని కోరారు.

సీతారామాపురంలో నేడు పూజలు

మహానంది: సీతారామాపురంలోని పురాతనమైన శ్రీ కోదండరామ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దేవదాయశాఖ రూ. 84.24 లక్షలు మంజూరు చేసిందని ఈఓ నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా విగ్రహాలను తొలగించాల్సి ఉన్నందున బుధవారం బాలాలయం పూజలు చేపడుతున్నట్లు తెలిపారు. బందోబస్తు, పర్యవేక్షణ నిమిత్తం హాజరు కావాలని తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, ఎస్ఐ నాగార్జునరెడ్డిలకు లేఖలు రాసినట్లు చెప్పారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, మండల కో ఆప్షన్ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామని వెల్లడించారు.

వాల్మీకులపై టీడీపీది కపటప్రేమ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

జూపాడుబంగ్లా: బీసీలకు పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పుకొనే టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ బలపరచిన ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ అభ్యర్థి వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ మధుసూదన్ ఏకగ్రీవం కాకుండా అడ్డుకోవటం సిగ్గుచేటని మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు అన్నారు. ఆ పార్టీకి వాల్మీకులపై ప్రేమ లేదన్నారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికల్లో తాము పోటీచేయబోమని పేర్కొన్న టీడీపీ నాయకులు చేతగాని తనంతో అనామకులైన సర్పంచులతో ఎమ్మెల్సీగా పోటీ చేయించి కుటిల రాయకీయాలు చేయటం తగదన్నారు. నిజంగా టీడీపీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లయితే బీసీ వాల్మీకి వర్గానికి చెందిన డాక్టర్ మధుసూదన్ ఎమ్మెల్సీ ఏకగ్రీవం కాకుండా ఎందుకు అడ్డుకొంటున్నారని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన వాల్మీకుల సత్తాఏంటో టీడీపీకి రుచిచూపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అల్లూరు రవి, మల్యాల సర్పంచ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్షం రోజుల్లో ఆపరేటింగ్ గది నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: పారుమంచాల విద్యుత్ ఉపకేంద్రం వద్ద మధ్యలో ఆగిపోయిన విద్యుత్ ఆపరేటింగ్ గది నిర్మాణాన్ని వారం రోజుల్లో పూర్తి చేస్తామని పనులు దక్కించుకున్న లోకేశ్వర్ కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం తెలిపింది. 'సాక్షి'లో సోమవారం 'నిలిచిన పనులు.. గుడిసెలోనే విధులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి కంపెనీ యాజమాన్యం స్పందించింది. మంగళవారం వారు 'సాక్షి' తో మాట్లాడుతూ పారుమంచాల విద్యుత్ ఉపకేంద్రం వద్ద నిర్మాణంలో ఉన్న విద్యుత్ ఆపరేటింగ్ గది నిర్మాణం పనులు వెంటనే ప్రారంభిస్తామని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో పనులు చేస్తుండటం వల్ల గది నిర్మాణం పనుల్లో జాప్యమైందన్నారు. సిబ్బంది ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మరో పక్షం రోజుల్లోగా పనులు పూర్తిచేస్తామని తెలిపారు.

సీవీ రామన్ సేవలు చిరస్మరణీయం

- ఘనంగా సైన్స్ దినోత్సవం



బ్రాహ్మణకొట్కూరులో విద్యార్థులు రూపొందించిన నమూనాలను తిలకిస్తున్న ఎంఈఓ ఫైజున్నిసా

జూపాడుబంగ్లా: డాక్టర్ సీవీ రామన్ సేవలు చిరస్మరణీయమని నందికొట్కూరు ఎంఈఓ ఫైజున్నిసా, జూపాడుబంగ్లా ఎంఈఓ మోహన్, జూపాడుబంగ్లా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, దామగట్ల హెచ్ఎం ఇమ్మానియేల్, బ్రాహ్మణకొట్కూరు హెచ్ఎం తిమ్మయ్య అన్నారు. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జూపాడుబంగ్లా మోడల్‌స్కూల్, బ్రాహ్మణకొట్కూరు, దామగట్ల, జూపాడుబంగ్లా ఉన్నత పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పలు రకాల సైన్స్ నమూనాలను ప్రదర్శించారు.

ఘనంగా వేడుకలు

పగిడ్యాల: మండలంలోని కొత్త పాలమర్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ సుభాన్ ప్రముఖ భౌతికశాస్త్ర పరిశోధకుడు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు వాణి లక్ష్మీదేవి, సీఆర్‌పీ మధునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయం తదితర పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో జాతీయ సైన్సు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం శివజ్యోతి, సైన్సు ఉపాధ్యాయులు ఎల్లస్వామి, భార్గవ, తేజోవతి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అవసరం

మహానంది: విద్యార్థులల్లో శాస్త్రీయ దృక్పథం అవసరమని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నంద్యాల మిడ్ టౌన్ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సైన్స్‌ఫేర్ నిర్వహించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు డీవీ సుబ్బయ్య, కార్యదర్శి కేశవమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలోని శ్రీ నారాయణ విద్యావిహార్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు పలు శాస్త్ర పరిశోధన నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గంజి రాజశేఖర్, కరస్పాండెంట్ గంజి మోహన్ కుమార మంగళం పాల్గొన్నారు.

వెలుగోడు : పట్టణంలోని థెరిసా ఇంగ్లిష్ మీడియం హై స్కూల్‌లో మంగళవారం ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం అతావుల్లా, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలు ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు.

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో..

పట్టణంలోని ఐటీఐ కాలేజీలో భారత క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం సహకారంతో ప్రేరణ రూరల్ డెవలప్ మెంట్ ప్రసిడెట్ నూలు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వలంటీర్ సురేష్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం జాతీయ సైన్స్‌దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకటనరసయ్య సైన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ పద్మావతి, శివరామరెడ్డి, చంద్రశేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని జీ పుల్లారెడ్డి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో హెచ్ఎం చాంద్‌బాష, రమణ సీవీ రామన్ సేవలను కొనియాడారు. అలాగే పట్టణంలోని ప్రగతి హైస్కూల్‌లో హెచ్ఎం శకుంతల ఆధ్వర్యంలో విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు.

మహానంది ముఖ్య అర్చకుడికి చార్జ్‌మెమో

మహానంది: మహానంది దేవస్థానంలోని శ్రీ మహానందీశ్వరస్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ముఖ్య అర్చకుడు మామిళ్లపల్లి రాఘవశర్మకు చార్జ్‌మెమో జారీ చేసినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవం పూజలకు నంద్యాలకు చెందిన కూరగాయల, కల్యాణోత్సవ దాత టి.ప్రసాద్ దంపతులు హాజరయ్యారన్నారు. అక్కడ జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో అర్చకుడు మమ్మల్ని అగౌరవపరిచారని దాత ప్రసాద్ దంపతులు అలిగి పూజల నుంచి నిష్క్రమించి వెళ్లిపోయారని చెప్పారు. దీంతో విచారణ చేపట్టి, తర్వాత సీసీ కెమెరాలను పరిశీలించి దాతలను అగౌరవపరిచినట్లు గుర్తించామన్నారు. ఇందుకు వారం రోజుల్లో సంజాయిషీ కోరుతూ చార్జ్‌మెమో జారీ చేసినట్లు వెల్లడించారు.

మద్యం దుకాణాల తనిఖీ

శిరివెళ్ల: మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను మంగళవారం ఎక్సైజ్ అధికారుల తనిఖీ చేశారు. నంద్యాల జిల్లా ఎక్సైజ్ అధికారి రవి కుమార్ ఆధ్వర్యంలో గోవిందపల్లె, యర్రగుంట్ల మద్యం దుకాణాలను తనిఖీ చేసి మద్యం నిల్వలు, ధరల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లావాదేవీలన్నీ సక్రమంగా ఉన్నాయన్నారు. తనిఖీల్లో సబ్‌ఇన్‌స్పెక్టర్ అస్లాం బేగ్ పాల్గొన్నారు.